



# కన్నీరు కార్చిన ఉపాధ్యాయురాలు

**మరియా – బల్గేరియా**

ఈ వారం మిషన్ పొలపు కథ, క్వార్టర్లీ మిషన్ ప్రాజెక్ట్ కానుక అని కూడా పిలువబడే 13వ సబ్బాతు కానుకల ద్వారా ప్రయోజనము పొందిన ఒక ప్రాజెక్ట్ గురించి తెలియచేయుచున్నది.

బల్గేరియా ముఖ్యపట్టణమైన సోఫియాలో ఉన్న కలర్ఫుల్ హోప్ వ్యవస్థాపకురాలైన మరియాకు ఒక సెవెంత్–డే ఎడ్వెంటిస్ట్ మహిళ ఫోన్ చేసి, కిండర్ గార్టెన్ లో పనిచేయుటకు ఒక టీచర్ను రికమెండ్ చేసింది. "కిండర్ గార్టెన్‌లో ఖాళీ ఉంటే, ఆమెను పరిగణనలోకి తీసుకోవచ్చు" అని ఆమె మరియా తో చెప్పింది. కలర్ఫుల్ హోప్ కిండర్గార్టెన్ లో అవసరానికి మించి టీచర్లు ఉన్నారు, కానీ వ్యవస్థాపకురాలైన మరియా, కిండర్గార్టెన్ ప్రారంభించినప్పటి నుండి ఇన్నేళ్లలో దేవుడు అనవసరమైనది ఏదీ ఇవ్వడని తెలుసుకుంది. ఆమె ఆయన స్వరాన్ని వినడం మరియు ఆయన చిత్తాన్ని వెతకడం నేర్చుకుంది.

కాబట్టి, "ప్రస్తుతానికి మాకు అదనపు టీచర్ అవసరం లేదు, కానీ నేను తాన్యను కలవడానికి సంతోషిస్తాను " మరియా ఆమె తో చెప్పింది. ఉద్యోగ ఇంటర్వ్యూ సమయంలో, మరియా తాన్యను " మీరు యేసు క్రీస్తును అనుసరించువారా? అని అడిగింది. అందుకు తాన్యా, తన భర్త కొన్ని నెలల క్రితం ఎడ్వెంటిస్ట్ చర్చిలో చేరాడని, ఆ విషయంపై అతని మీద తనకు చాలా కోపంగా ఉందని బదులిచ్చింది. వారంలో చాలా రోజులు అతని ఉద్యోగ రీత్యా ఇంటికి దూరంగా ఉంటాడు. అయినను అతను శనివారాలు తనతో సమయం గడపకుండా చర్చిలో ఎందుకు గడుపుతాడో ఆమెకు అర్థం కాలేదు. అందుచే , భర్తతో కలిసి బైబిల్ చదవాలన్నా, చర్చికి రావాలన్నా తాన్యా నిరాకరించింది.

మరియా తాన్యకు కిండర్ గార్టెన్ గురించి చెప్పింది. దానిని తాను 2016లో స్థాపించానని, సోఫియాలోని రెండు ప్రదేశాలలో ఇప్పుడు సుమారు 30 మంది పిల్లలు ఉన్నారని వివరించింది. ఎడ్వెంటిస్ట్ ఉపాధ్యాయులు ఏమి నమ్ముతారో, వారు ఎలా పని చేస్తారో కూడా ఆమె వివరించింది. ఆధ్యాత్మిక విషయాల పట్ల తాన్య సుముఖంగా

ఉన్నట్లు మరియాకు అనిపించింది. ఆ తర్వాత వారి సంభాషణ కిండర్ గార్టెన్ ఎదుర్కొన్న సవాళ్లు, దేవుడు అద్భుతంగా ఎలా నడిపించాడనే విషయాల వైపు మళ్లింది. తాన్యను కిండర్ గార్టెన్ లో బోధించడానికి అవకాశం ఇవ్వాలనిపించి, మరియా ఆమెకు పార్ట్–టైమ్ ఉద్యోగాన్ని ఇచ్చింది. రెండు రోజుల తరువాత, తాన్యా ఉద్యోగాన్ని అంగీకరిస్తూ ఫోన్ చేసింది.

ఒక నెల తరువాత, మరియా మిగిలిన కథను తెలుసుకుంది. తాన్యా, ఇంటర్వ్యూకు హాజరైనప్పుడు ఆమె భర్త, డెనిస్లావ్, కారులో ఆమె కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. ఇంటర్వ్యూ అయిపోయిన తరువాత తాన్యా తమ కారు వద్దకు తిరిగి వచ్చి భర్త పక్కన కూర్చుని, 30 నిమిషాల పాటు ఏడ్చింది. పరిశుద్ధాత్మ దేవుడు ఆమె హృదయంపై పనిచేయుచున్నాడని గ్రహించి, అతను కేవలం చిరునవ్వు నవ్వాడు.

ఇంటర్వ్యూ సమయంలో, మరియా లాగా విశ్వాసంతో కూడిన జీవితాన్ని గడపాలనే కోరిక తన హృదయంలో ఏర్పడిందని, మరియు తాను కిండర్ గార్టెన్ నుండి బయటకు వస్తున్నప్పుడు, తనపై సూర్యుడు ఒక కొత్త రీతిలో ప్రకాశిస్తున్నట్లు ఆమెకు అనిపించిందని తన జీవితంలో మొదటిసారిగా, దేవుడు తనను ప్రేమిస్తున్నాడన్న భావన తనలో కలిగినందు చేత తాను కారులో తన భర్త ప్రక్కన కూర్చుని 30 నిమిషాలపాటు ఏడ్చానని తాన్యా మరియాకు వివరించింది.

చివరికి కారులో తన కన్నీళ్లను తుడుచుకున్నప్పుడు, విశ్రాంతి దినాన అతనితో పాటు చర్చికి వస్తానని ఆమె డెనిస్లావ్‌కు వాగ్దానం చేసింది. ఆమె తన వాగ్దానాన్ని నిలబెట్టుకుంది. మరియా తాన్యాకు బైబిల్ అధ్యయనాలు చెప్పడం ప్రారంభించింది, మరియు తొమ్మిది నెలల తర్వాత, తాన్యా యేసుకు తన హృదయాన్ని అర్పించి బాప్తిస్మం తీసుకుంది. డెనిస్లావ్ చాలా సంతోషించాడు.

తన కథలోని కొంత భాగాన్ని ఎవరికీ చెప్పకుండా తనలోనే దాచుకున్నానని చాలా కాలం తర్వాత, తాన్యా ఒప్పుకుంది. సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ కిండర్ గార్టెన్లో ఉద్యోగం కోసం తాన్యాకు ఇంటర్వ్యూ జరిగిన రెండు రోజుల తర్వాత, ఒక మాజీ యజమాని ఇంకొక కిండర్ గార్టెన్లో కొంత యాజమాన్యపు హక్కును కూడా ఇవ్వడానికి ఫోన్ చేశాడు. అక్కడ తాన్యాకు అధిక జీతంతో పాటు, తన సొంత బృందాన్ని నియమించుకోవడానికి మరియు దాని కార్యక్రమాలను తీర్చిదిద్దడానికి పూర్తి స్వేచ్ఛను కలిగి ఉంటుంది. ఆ ప్రతిపాదన చాలా ఆకర్షణీయంగా ఉంది. కానీ తాన్యా తనకున్న లోకపరమైన అవకాశాలను బేరీజు వేసుకొని, దాన్ని అంగీకరిస్తే తాను ఒక అమూల్యమైన ఆధ్యాత్మిక అవకాశాన్ని కోల్పోతానని గ్రహించింది. అందుకే, దానికి బదులుగా

సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ కిండర్ గార్టెన్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగాన్ని అంగీకరించడానికి ఆమె మరియాకు ఫోన్ చేసింది.

నేడు, తాన్యా ఆ ఎడ్వెంటిస్ట్ కిండర్ గార్టెన్ యొక్క రెండవ శాఖను నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ మరియా కిండర్ గార్టెన్ యొక్క మొదటి శాఖ బాధ్యతలను చూసుకుంటున్నారు. అంతేకాకుండా, తాన్యా మరియు డెనిస్లావ్ ఇప్పుడు సంఘ స్థాపకులుగా మారారు. సోఫియా నగరంలోని ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఎడ్వెంటిస్ట్ సంఘం యొక్క అవసరం ఉందని గుర్తించి, వారు అక్కడ ఒక సువార్త కార్యక్రమాన్ని ప్రారంభించి, ఒక సంఘాన్ని స్థాపించారు.

"మనం సొంతంగా ఏమీ చేయలేము అనే సత్యాన్ని గ్రహించడం ఎంతో అద్భుతమైన అనుభవం, యేసు ప్రభువు ,'నేను లేకుండా మీరు ఏమీ చేయలేరు" అని చెప్పారు. అయితే మీరు ఆయన యందు నమ్మికయుంచి, ఆయనకు అవకాశం ఇచ్చినప్పుడు, ఆయన అద్భుతాలు చేస్తారు." అని మరియా అన్నారు.

ఈ త్రిమాసం యొక్క 13 వ సబ్బాతు కానుకలలో కొంత భాగం,

కలర్ఫుల్ హోప్ కిండర్ గార్టెన్‌ను, వారు అద్దెకు తీసుకున్న భవనం నుండి సోఫియాలోని వారి స్వంత భవనంలోకి మారడానికి వినియోగించబడును. ఈ కిండర్ గార్టెన్‌కు వచ్చే పిల్లలలో సగానికి పైగా ఎడ్వెంటిస్ట్ చర్చిలో సభ్యులు కాని కుటుంబాల నుండి వస్తారు. కొందరు దేవుడిని నమ్మరు. బల్గేరియాలోని జీవితాన్ని మార్చే ఈ ప్రాజెక్టు మరియు ప్రయోజనం పొందే ఇతర ప్రాజెక్టుకు మీరు అందిస్తున్న ధారాళమైన కానుకలకై మీకు కృతజ్ఞతలు. ఇంటర్-యూరోపియన్ డివిజన్లోని ఇతర ప్రాజెక్టులో రొమేనియాలో రెండు పాఠశాలలు; బెల్జియంలో ఒక యూత్ క్యాంప్, చర్చ్ క్యాంప్ మరియు శిక్షణా కేంద్రం; మరియు ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో ఉన్న ఇటాలియన్ ఎడ్వెంటిస్ట్ యూనివర్సిటీ విల్లా అరోరాలో ఒక వసతి గృహం ఉన్నాయి.